క్లుప్తంగా

ఉత్సాహంగా హోలీ వేడుకలు



నర్సింగ్ కళాశాలలో హోలీ వేడుకలు

దెందులూరు: స్థానిక నర్సింగ్ కళాశాల విద్యార్థినులు హోలీ వేడుకలను నిర్వహించారు. మంగళవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో హోలీ పండుగ సందర్భంగా రంగులు రాసుకుని స్వీట్లు పంపిణీ చేశారు. పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తాము ఒక్కటై ఇక్కడ హోలీ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

చెరువుల చుట్టూ ఆక్రమణల తొలగింపు



బాదంపూడిలో చెరువు చుట్టూ ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బాదంపూడిలోని నాలుగు చెరువులు చుట్టు ఆక్రమణలను మంగళవారం తొలగించారు. ఆక్రమణదారులకు ముందుగానే నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలను మంగళవారం తొలగించారు. ఈవోపీఆర్డీ షంసుద్దీన్, కార్యదర్శి నాగేశ్వరరావు, రివెన్యూ అధికార్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 28 ఆక్రమణలు తొలగించినట్లు ఈవోపీఆర్డీ షంసుద్దీన్ తెలిపారు. గోదావరి కాలువ గట్లపై ఉన్న ఆక్రమణలుదార్లకు ఉంగుటూరు పంచాయతీ కార్యదర్శి గిరిధర్ మంగళవారం నోటీసులు ఇచ్చారు. కైకరం, చేబ్రోలులోనూ ఆక్రమణదార్లకు నోటీసులు ఇచ్చారు.

మహిళలకు ఘన సత్కారం



పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : సమాజానికి, కుటుంబానికి ఎనలేని వెల కట్టలేని సేవలందిస్తున్న మహిళలకు పాదాభివందనాలు చేస్తూ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన, ఎంపీడీఓ మంగళవారం పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు లింగ సమానత్వాన్ని, చట్టాలను వివరించారు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించాలని ఎంపీడీవో రాజ్ మనోజ్ అన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పెదపాడు: గ్రామ సచివాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ డీఎల్డీఓ రమణ తెలిపారు. పెదపాడులోని సచివాలయం-1,2, నాయుడుగూడెం గ్రామ సచివాలయాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసారు. గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా తీసారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నింటా తానై.. సత్తా చాటుతున్న అతివలు

- ప్రజాప్రతినిధులుగా రాణిస్తున్న మహిళలు
- మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



దెందులూరు: పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ నేటి మహిళలు పోటీపడుతున్నారు. దీని కంతటికి విద్యే పునాదిగా నిలుస్తోంది. విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించేందుకు అడ్డంకులను అధిగమించి విజయం సాధించి అతివలు చరిత్ర సృష్టిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు వ్యవసాయం నుంచి పైలెట్ల వరకు అన్ని రంగాల్లో తమ ప్రతిభాపాటవాలను చాటుకుని యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. దీనికి తోడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని ఆచరణలో పెట్టి అమలు చేయడంతో దెందులూరు మండలంలో సామాన్య కుటుంబాల నేపథ్యం కలిగిన దాదాపు 20 మంది మహిళలు ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా సేవలందిస్తున్నారు. దెందులూరు మండలంలో ఎంపీపీ ఒకరు, జెడ్పీటీసీ ఒకరు, 9 మంది సర్పంచులు, 8 మంది ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులుగా రాజకీయాల్లో రాణించడం 70 ఏళ్ల చరిత్రలో రికార్డు.

సమాజాభివృద్ధిలో స్త్రీపాత్ర కీలకం

ఉంగుటూరు: సమాజాభివృద్ధికి స్త్రీల పాత్ర ఎంతో కీలకమైనదని నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ టి.కె విశ్వేశ్వరరావు అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం నారాయణపురం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ చెల్లిగా, తల్లిగా, భార్యగా స్త్రీ పాత్ర ఎంతో అమోఘమైనదని అన్నారు. సమాజ పురోభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. అతిథిగా పాల్గొన్న చేబ్రోలు కార్మెల్ కాన్వెంటు స్కూలు ప్రిన్సిపాల్ సిస్టరు సారూప్య మాట్లాడుతూ చదువు ద్వారానే సమాజం పురోభివృద్ధి చెందుతుందన్నారు. స్త్రీ చదువుకుంటే కుటుంబం అంతా చదువుకుంటారని అన్నారు. కేర్మెల్ స్కూల్ సిస్టర్ జీవా, కోఆర్డినేటర్ డా. బి జాన్సీరాణి, డి. రెడ్డయ్య, డా. కొండారవిలు మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు విద్యార్థులకు మ్యూజికల్ చైర్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి



నా భర్త దెందులూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఎన్నికల అనంతరం ఆయన కాలం చేశారు. ఎంపీపీ స్థానం బీసీ మహిళకు కేటాయించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో ఎంపీపీగా ఎన్నికయ్యాను. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎంపీపీగా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి రుణపడి ఉంటాను.

– బొమ్మనబోయిన సుమలత, ఎంపీపీ, దెందులూరు మండలం

విద్య కలిసొచ్చింది



ఎంబీఏ యూనివర్సిటీ క్యాంపస్‌లో చదివాను. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టాను. దెందులూరు జెడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. ఎస్సీ మహిళల్లో ఉన్నత విద్యావంతురాలుగా గుర్తించి అవకాశం కల్పించారు. దీంతో జెడ్పీటీసీ అయ్యేందుకు అవకాశం కలిగింది.

– నిట్టా లీలానవకాంతం, జెడ్పీటీసీ, దెందులూరు మండలం

మహిళలు అన్ని రంగాల్లో రాణింపు



భీమడోలులో మహిళా కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: ఎక్కడ మహిళలు గౌరవింపబడతారో ఉన్నత విలువలు కలిగిన సమాజమవుతుందని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ అన్నారు. భీమడోలులోని శ్రీవేంకటేశ్వర దేవస్థానం ఆధీనంలోని శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సేవలందిస్తున్న కళాశాలల మహిళా ఉపాధ్యాయులకు, మహిళా పోలీస్ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై చావా సురేష్‌కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. తాను చదువుకునే రోజుల్లో ఆడపిల్లలు తక్కువగానే చదువుకునే వారన్నారు. నేడు ఆ పరిస్థితులు లేవని, పురుషులతో సమానంగా చదువుకుంటూ అన్నింటా సగ భాగమయ్యారన్నారు. కళాశాల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏన్నో ఏళ్లుగా మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ మాట్లాడుతూ కళాశాలలో మహిళా అధ్యాపకురాలు చేస్తున్న సేవ క్యాక్రమాలను ప్రశంసించారు. అనంతరం మహిళా కానిస్టేబుల్స్ రత్నమౌళిక, జ్యోతి, దివ్యదీప్తి, దేవి, మహిళా లెక్చరర్స్ మాధవి, గౌరి, విజయలక్ష్మి, పద్మజలను దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డీఎంబీబీ సింగ్, ఎన్ఎస్ఎస్ పీవోలు ఆర్. ధనరాజు, జి.నాగరాజు, ఆధ్యాపకులు, మహిళా పోలీసులు, ఎన్ఎస్ఎస్ మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-1 సాధించడమే లక్ష్యం



పెదవేగి : నేను దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి మండలం విజయరాయి 2 సచివాలయానికి పంచాయతీ కార్యదర్శిగా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాను. నాన్న ప్రైవేట్ ఐటీఐ కళాశాల్లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. హ్యాండ్‌బాల్‌లో నేను ఇప్పటివరకు 38 జాతీయస్థాయి పోటీల్లో, 58 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఇండో బంగ్లా టెస్ట్ హ్యాండ్‌బాల్ మ్యాచ్‌లో ఇండియా తరుపున బంగ్లాదేశ్‌లో ఆడి ఫస్ట్‌ప్లేస్ సాధించాను. గత ఫిబ్రవరి 27, 28 తేదీల్లో నిర్వహించిన ఏపీ స్టేట్ ఉమెన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచి మొదటి బహుమతి సాధించాను. ఈనెల 15 నుంచి 19 వరకు వారణాసిలో నిర్వహించనున్న 8వ సీనియర్ ఉమెన్ నేషనల్స్‌లో పాల్గొంటాను. స్పోర్ట్స్ కోటాలో గ్రూప్-1 అధికారి లేదా డిగ్రీ లెక్చరర్ సాధించి ప్రజలకు సేవ చేయాలని నా ఆశ.

– వి. సౌజన్య, హ్యాండ్‌బాల్, క్రీడాకారిణి



సమాజంలో స్త్రీకి ప్రత్యేక స్థానం



దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో సీడీపీఓ కృష్ణకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: సమాజంలో స్త్రీకి ప్రత్యేక స్థానం ఉందని స్త్రీలంతా క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించాలని కాళ్ల సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. మంగళవారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత దెందులూరు ప్రభుత్వ బాలసదనంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఇటీవల సీడీపీఓగా పదోన్నతి పొందిన కృష్ణకుమారిని కరస్పాండెంట్, కళాశాల అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. సీడీపీఓ కృష్ణకుమారి మాట్లాడుతూ మహిళలు పురుషులకు ఏ మాత్రం తీసిపోరని, అన్ని రంగాల్లో తమ ప్రతిభాపాటవాలను చాటుకుని నిరూపించారన్నారు. విద్యతోనే అవగాహన, అభివృద్ధి ముడిపడి ఉందన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులకు నిత్యం వినియోగించే 11వస్తువులను సీడీపీఓ పంపిణీ చేశారు.

డీఈఓ సలీం బాషాకు సత్కారం



డీఈఓ సలీం బాషాను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ నత్తానియేల్, కళాశాల సిబ్బంది

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్ సలీం బాషా అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులు కావడం గోపన్నపాలెం వ్యాయామ కళాశాలకు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలకు గర్వకారణంగా, సంతోషంగా ఉందని ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. మంగళవారం కళాశాలలో డీఈఓ సలీం బాషాకు తొలుత శాలువా, పూలదండలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సమావేశంలో సలీం బాషా వ్యాయామ ఉపాధ్యాయుడి నుంచి డీఈఓగా ఎదగడంపై మాట్లాడారు. సలీం బాషాను ఆదర్శంగా తీసుకుని వ్యాయామ విద్యార్థులు ఎదగాలన్నారు. డాక్టర్ పీవీకేడీ ప్రసాద్, డాక్టర్ వీ.శ్యామల, రమేష్, ఎస్. విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

జయపురం లేఅవుట్ పరిశీలన



జయపురం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న పెదపాడు తహసీల్దార్ విజయకుమార్ రాజు

పెదపాడు: జయపురం లే అవుట్‌ను పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్‌రాజు మంగళవారం పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం జరుగుతున్న తీరును పరిశీలించి నిర్మాణాల వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులకు బిల్లులు అందించేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ చైతన్యకు సూచించారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీలాద్రిపురంలో పోస్టాఫీసు ప్రారంభం



పోస్టాఫీసు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పోస్టల్ సూపరిండెంటు సీవీ రామిరెడ్డి

ఉంగుటూరు: ప్రజలందరూ పొదుపు ఖాతాలు ప్రారంభించి పోస్టాఫీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరిండెంటు సీవీ రామిరెడ్డి అన్నారు. నీలాద్రిపురంలో తపాలశాఖ కార్యాలయాన్ని పోస్టల్ శాఖ ప్రారంభించింది. సర్పంచి చదలవాడ రాజేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామిరెడ్డి మాట్లాడుతూ పోస్టల్ బీమా పాలసీలతో అధిక ప్రయోజనం అందుకోవచ్చని సూచించారు. ఆడపిల్లలకు ఉపయోగపడే సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవాలని తెలిపారు. గ్రామంలో నూతన తపాలా కార్యాలయాన్ని ప్రారంభించినందుకు రాజేంద్ర, స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీకాంత్, ఉంగుటూరు పోస్టుమాస్టారు జి.శ్రీనివాసు, సొసైటీ డైరెక్టరు సరే ఏడుకొండలు, సీహెచ్ బెన్ని, అశోక్, రాజేష్, డి. కృపారావు, సి హెచ్ నాగరాజు పాల్గొన్నారు.

మహిళా హక్కులపై అవగాహన పెంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విశ్రాంత న్యాయమూర్తి అడబాల లక్ష్మి

గణపవరం: మహిళల రక్షణకోసం ఏర్పాటుచేసిన చట్టాలను అవగాహన చేసుకుని వాటి అమలు కోసం కృషి చేయాలని విశ్రాంత జిల్లా జడ్జి శ్రీమతి అడబాల లక్ష్మి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. సదస్సుకు ప్రిన్సిపల్ నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈసదస్సులో ఆమె మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా జరిగిన పోరాటాల ఫలితంగా మహిళలకు కొన్ని ప్రత్యేక చట్టాలు వచ్చాయన్నారు. మహిళల కోరిక మేరకు అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ప్రారంభించారని, ఈరోజు మహిళలకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నరోజని అన్నారు. ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక విద్యలో మహిళలకు తగిన ప్రాతినిధ్యంలేదని, ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో మహిళలు కేవలం 28శాతం మాత్రమే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ రాష్ట్ర సమన్వయకర్త కె.విజయ, వైస్‌ప్రిన్సిపల్ మధురాజు, న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, కళాశాల మహిళాసాధికారత విభాగం కన్వీనర్ కె.స్వరూపరాణి తదితరులు మాట్లాడారు. ఈసందర్భంగా కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

పెదపాడు: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై నిరసనగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయు అధ్యక్షుడు బీ సోమయ్య తెలిపారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలస్థాయి కార్మిక కర్షక ఐక్యతా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ కేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని ఆందోళన వ్యక్తం చేసారు. కనీస వేతనం రూ.26 ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, పి దుర్గ, లింగం కృష్ణారావు, రెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మహిళ మృతి

పెదవేగి : కడుపు నొప్పి తాళలేక ఓ మహిళ పురుగు మందు తాగి దుర్మరణం చెందిన ఘటన పెదవేగిలో తీవ్ర కలవరాన్ని సృష్టించింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి గ్రామానికి చెందిన అంగలకుదురు కళావతి(48) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం కడుపునొప్పి అధికమవడంతో ఇంట్లోని పురుగు మందు తాగేసింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కళావతి మృతిచెందింది. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతురాలికి భర్త రాంబాబు, ఇద్దరు సంతానం ఉన్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి గ్రామోత్సవం

భీమడోలు: భీమడోలులో వేంచేసియున్న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. ఐదో రోజైన మంగళవారం స్వామివారిని పల్లకిలో ఊరేగించి, జాతీయ రహదారి పక్కనే ఉన్న గోదావరి కాల్వలో స్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు కాశ్లకూరి ఉమాశంకర్‌శర్మ, బృందావన పవన్, భట్టాచార్యులు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లను భక్తులు స్వామి వార్ల నామస్మరణ చేస్తూ పురవీధుల్లో ప్రదర్శన చేస్తూ ఊరేగించారు. స్వామి వార్ల పల్లకీల వెంట భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి గోదావరి నదీలో పుణ్యస్నానాలాచరించారు.

వ్యాన్ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

పెదవేగి : గూడ్స్ వ్యాన్ డ్రైవర్ వేగంగా వాహనాన్ని నడిపి ఓ మహిళ మరణానికి కారణమవ్వడంతో అతనికి న్యాయస్థానం ఏడాదిపాటు జైలు శిక్ష విధించింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటాని హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె తల్లి వీరలక్ష్మి, స్నేహితురాలు గౌతమి, బంధువుల వ్యక్తితో కలిసి 2021 అక్టోబర్ 21 రాత్రి 8 గంటల సమయంలో హైదరాబాదు నుంచి తూర్పుగోదావరిలోని జగన్నాథగిరి వెళుతూ, పెదవేగి మండలం భోగాపురం సమీపంలో ఆగారు. ఏపీ 39 టీఎస్ 4751 నంబరు గల గూడ్స్ వ్యాన్ డ్రైవర్ వక్కపట్ల వీరవెంకట సత్యనారాయణ వేగంగా వచ్చి ఆగి ఉన్న కారును డోర్ దగ్గర ఉన్న వీరలక్ష్మి, గౌతమిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో వీరలక్ష్మి అక్కడిక్కడే మరణించింది. గౌతమికి తీవ్రగాయాలయ్యాయి. దీనిపై అప్పటి హెడ్‌కానిస్టేబుల్ ఎం శ్రీను కేసు నమోదు చేశారు. మంగళవారం ఫస్ట్ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వీ రఘునాథ్ విచారణ అనంతరం వ్యాన్ డ్రైవర్ వీరవెంకట సత్యనారాయణకు సంవత్సరాల కాలం జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ డి కాసిం వాదించగా, పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్, హెచ్‌కానిస్టేబుల్ ఎం వాసు సహకరించారు.

బహిరంగ వేలం ప్రకటన

డి.బాదంపూడి విశాల సహకార పరపతి సంఘం. లి॥నెం. - బాదంపూడి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఉంగుటూరు మండలం, బాదంపూడి గ్రామములో బాదంపూడి విశాల సహకార పరపతి సంఘ ఆఫీసు భవనము నందు ఈ దిగువ తెలిపిన బకాయి బాకీదారులు సదరు సంఘములో ఋణము తీసుకొని తిరిగి చెల్లించక పోవుటవలన మీరు సంఘమునకు తనఖా పెట్టబడిన స్థిరాస్తులను డిప్యూటి రిజిస్ట్రార్/ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఏలూరి వారి ఉత్తర్వులు ప్రకారము ది.13-03-2023 అనగా సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తాడేపల్లిగూడెం మెయిన్ బ్రాంచి సేల్ ఆఫీసర్ వారిచే బాదంపూడి ఎల్.ఎస్.సి.ఎస్.ఆఫీసు భవనము నందు బహిరంగముగా వేలము వేయబడును. కావున ఆశక్తి కలవారు వేలము పాటలో పాల్గొనవచ్చును.

వ.నెం.	ఇ.పి.నెం.	బాకీదారు పేరు	ఆస్తి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం (యం.సెం)	సరిహద్దులు	చెల్లించవలసిన మొత్తం రూపాయలు	వేలం వేయు తేది, సమయము, స్థలం
1.	2409/ 22-23	పులుపు సరయ్య తండ్రి వెంకన్న యల్లమిల్లి	యల్లమిల్లి	193/1 197/2 202/1 189/3 189/4 202/6	0-37 0-40 0-10 1/2 0-18 1/2 0-14 0-15 1-44	కలవు	రూ.2,68,905/- (-) తదుపరి వాయిదాలు (+) తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.13-03-2023 సమయం ఉ.10.30లకు బాదంపూడి విశాల సహకార పరపతి సంఘం నందు
2.	2412/ 22-23	వంకిన రామదాసు తండ్రి : రవీంద్ర నాథ్ ఠాగూర్ బాదంపూడి	బాదంపూడి	ఆర్.ఎస్.నెం. 133/2ఎ	య.15-37 సెంట్లు	[illegible]	రూ.11,27,827/- (-) తదుపరి వాయిదాలు (+) తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.13-03-2023 సమయం మ.3.00లకు బాదంపూడి విశాల సహకార పరపతి సంఘం నందు
3.	2414/ 22-23	వంకిన శ్రీనివాసు తండ్రి : రవీంద్ర నాథ్ ఠాగూర్ బాదంపూడి	బాదంపూడి	186 186 133/2ఎ	య.4-00 య.1-38 య.12-30 య.17-68	కలవు	రూ.26,10,100/- (-) తదుపరి వాయిదాలు (+) తదుపరి వడ్డీ (+) ఇతర ఖర్చులు	తేది.13-03-2023 సమయం మ.3.30లకు బాదంపూడి విశాల సహకార పరపతి సంఘం నందు

షరతులు : 1.వేలములో పాల్గొనదలచిన వారు వేలము వేయు అధికారి వద్ద రూ.10,000/-లు దరావత్తు చెల్లించి పాల్గొనవలెను. పాన్ కార్డు మరియు ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకురావలెను. 2.వేలము పాట అయిన వెంటనే హెచ్చుపాట దారులకు వేలము ఖరారు చేయబడును.
2. వేలము పాట అయిన వెంటనే హెచ్చుపాటదారులకు వేలము ఖరారు చేయబడును.
3. సదరు పాట సొమ్ములో 15 శాతం వాటా వేలం పూర్తి అయిన వెంటనే చెల్లించవలెను. సొమ్మును వేలము జరిగిన 15 రోజులలో పూర్తిగా చెల్లించవలెను.
4. డిప్యూటీ రిజిస్ట్రార్/ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ డి.సి.సి. బ్యాంకు ఏలూరు నుండి క్రియదస్తావేజును సొంత ఖర్చులపై రిజిస్ట్రేషన్ చేయించుకొనవలెను.
5. వేలము పాట ఏ కారణము చూపకనే రద్దు పరుచుటకుగాని వాయిదా వేయుటకుగాని సేల్ ఆఫీసర్ వారికి సర్వహక్కులు ఉన్నవి.
6. వేలమునకు సంబంధించిన వివరములు సేల్ ఆఫీసర్ ద్వారా గాని బాదంపూడి విశాల సహకార పరపతి సంఘం సెక్రటరీ వారి ద్వారా తెలుసుకొనవలెను.
7. పాటదారులు ఎవరు హాజరుకాని యెడల సదరు వేలం వేయు ఆస్తులు సంఘమునకు దాఖలు చేయబడును.
8. బాకీదారులు తనఖా పెట్టబడిన పై స్థిరాస్తిపై మరి ఏమైనా బకాయిలు ఉన్నను పాట సొమ్ము నుండి వసూలు చేయబడును.

బాదంపూడి విశాల సహకార పరపతి సంఘం
సి.ఇ.ఓ.

సం/- వెలగల నర్సిరెడ్డి
సేల్ ఆఫీసర్
డి.సి.సి.బి.తాడేపల్లిగూడెం









సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
Office mail : tpgadvt@gmail.com